

పాహిమాం.. రంగనాయకా

నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు నల్లమల అభయారణ్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుదీరారు. - 8లో..



మాదకద్రవ్యాలను నిరోధించాలి

మాదకద్రవ్యాల సాగు, రవాణా, వినియోగాన్ని జిల్లాలో పూర్తిగా నిరోధించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34 /27

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. గాలిలో తేమ శాతం అధికం. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

జేసీ అభిషిక్త్ కిషోర్ బదిలీ

● కొత్త జేసీగా శ్రీధర్


అభిషిక్త్ కిషోర్

ఒంగోలు అర్బన్: జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్‌ను బదిలీ చేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫైనాన్స్ డిపార్టుమెంట్ డిప్యూటీ సెక్రటరీగా ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సీసీఎల్ఎల్‌ఏ జాయింట్ సెక్రటరీ (విజిలెన్స్)గా పనిచేస్తున్న 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన చామకూరి శ్రీధర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమించారు.

పదో తరగతి పరీక్షకు 210 మంది గైర్హాజరు

ఒంగోలు: పదో తరగతి పరీక్షలకు గురువారం 210 మంది గైర్హాజరయ్యారు. రెండో పరీక్ష అయిన ద్వితీయ భాష పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 28,865 మందికిగానూ 28,655 మంది హాజరయ్యారు. జిల్లా పరీక్షల పరిశీలకుడు ప్రసన్నకుమార్ పొదిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, మర్రిపాలెం జెడ్పీ హైస్కూల్, మార్కాపురం బాలురు, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, తర్లుబాడు జెడ్పీహెచ్ఎస్, తుమ్మలచెరువు జెడ్పీహెచ్ఎస్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈవో పి.రమేష్ మరో 7 సెంటర్లను, స్క్వాడ్ బృందాలు 64 సెంటర్లను తనిఖీ చేశాయి. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదని డీఈవో పి.రమేష్ తెలిపారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు 204 మంది..

ఓపెన్ స్కూల్ పది పరీక్షలకు 51 మంది హాజరు కావాల్సి ఉండగా, 44 మంది హాజరయ్యారు. ఇంటర్‌కు సంబంధించి బయాలజీ సబ్జెక్టు పరీక్షకు 860 మందికిగానూ 786 మంది, కామర్స్ పరీక్షకు 1,213 మందికిగానూ 1,083 మంది హాజరయ్యారు. మొత్తంమీద 2,073 మందికిగానూ 1,869 మంది హాజరవగా, 204 మంది గైర్హాజరైనట్లు ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో కీలక అడుగు వేసింది. పంటలను కాపాడేందుకు ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్లు (పీహెచ్‌డీసీలు) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఏ పంటకు ఎంత మేరకు మందులు వాడాలి.. చీడపీడలకు ఏయే మందులు వినియోగించాలి.. వంటి సూచనలను సకాలంలో రైతులకు అందజేస్తూ నష్టపోకుండా అండగా నిలిచేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. రైతు భరోసా కేంద్రంలోనే వీటిని ఏర్పాటు చేయనుంది. ప్రాథమికంగా జిల్లాలో 38 ఆర్బీకేలను పీహెచ్‌డీసీల కోసం అధికారులు గుర్తించారు.

పొదిలి మండలంలో పీహెచ్‌డీసీగా ఏర్పాటు చేయబడిన మల్లవరం ఆర్బీకే



పంటలకూ ఆరోగ్య కేంద్రం!

- ప్రతి మండలంలో ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్
- జిల్లాలో ప్రాథమికంగా 38 కేంద్రాలు గుర్తింపు
- పీహెచ్‌డీసీ డాక్టర్లుగా ఆర్బీకే ఇన్‌చార్జులు
- వారికి అనుబంధంగా తోటబడి, పొలంబడి ట్రైనర్లు
- వీరందరికీ దర్శి కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ

పొదిలి రూరల్: రైతులు అవగాహన లేకుండా ఇష్టారాజ్యంగా పురుగు మందులు వాడటం, సరిగా పిచికారీ చేయకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయి. ఫలితంగా ఆర్థికంగా నష్టపోతున్నారు. వీరికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లాలో కొన్ని వేల ఎకరాల్లో ఉద్యానవన, వ్యవసాయ పంటలు సాగు చేస్తున్నారు. చీడపీడలతో అవి దెబ్బతింటున్నాయి. పంటలకు వచ్చిన సమస్య ఏదో తెలియక రైతులు రకరకాల పురుగుమందులు వాడుతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. అడ్డగోలుగా మందులు పిచికారీ చేయడంతో సమస్యలు మరింత పెరుగుతున్నాయి. వీటన్నింటినీ గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం.. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు పెంచడం, చీడపీడలను సకాలంలో గుర్తించి వాటి నివారణకు పరిష్కార మార్గాలు సూచించడమే లక్ష్యంగా పీహెచ్‌డీసీలను అందుబాటులోకి తీసుకొస్తోంది.

ఖరీఫ్ నాటికి అందుబాటులోకి...

తొలి దశలో మండలానికి ఒకటి చొప్పున జిల్లాలో 38 ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్లు ఏర్పాటు చేసేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. 2023–24 ఖరీఫ్ నాటికి రైతులకు వీటిని అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రతి మండలంలో సొంత భవనంలో కొనసాగుతున్న రైతు భరోసా కేంద్రాన్ని పీహెచ్‌డీసీగా గుర్తించారు. ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్ల డాక్టర్లుగా మొదటి ప్రాధాన్యత కింద అగ్రికల్చర్ ఎమ్మెస్సీ, హార్టీకల్చర్ ఎమ్మెస్సీ చేసిన ఆర్బీకే ఇన్‌చార్జులను ఎంపిక చేస్తారు. పైఅర్హతలు కలిగిన వారు లేకపోతే అగ్రికల్చర్ బీఎస్సీ, హార్టీకల్చర్ బీఎస్సీ చేసిన ఆర్బీకే ఇన్‌చార్జులను ఎంపిక చేస్తారు. వీరు కూడా లేకపోతే అగ్రికల్చర్, హార్టీకల్చర్‌లో డిప్లమో చేసిన వారిని ఎంపిక చేస్తారు. ఇప్పటికే జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున 38 మండలాల్లో పీహెచ్‌డీసీలకు అవసరమైన రైతు భరోసా కేంద్రాలను గుర్తించినట్టు జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఖరీఫ్‌లో పత్తి, కంది, వరి, పెసర, మినుము, ఆముదం, సజ్జ, ఉద్యానవన పంటలైన మిరప, బత్తాయి, నిమ్మ, అరటి, బొప్పాయి, మామిడి, దానిమ్మ సాగు చేస్తున్నారు. అలాగే పెద్ద ఎత్తున కూరగాయలు సైతం పండిస్తున్నారు.

మూడు విడతలుగా శిక్షణ...

ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్ల డాక్టర్లకు అనుబంధంగా పొలంబడి ట్రైనర్స్‌లో ఇద్దరు, తోటబడి ట్రైనర్స్‌లో ఇద్దరు ఉంటారు. పొలంబడి ట్రైనర్లలో జిల్లా వనరుల కేంద్రానికి చెందిన ఇద్దరు ఏవోలు, తోటబడి ట్రైనర్లలో ఇద్దరు ఉద్యానవన అధికారులు ఉంటారు. పీహెచ్‌డీసీ డాక్టర్లు, పొలంబడి ట్రైనర్లు, తోటబడి ట్రైనర్లకు మూడు విడతలుగా 18 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వీరికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇస్తారు. వ్యవసాయ, ఉద్యానవన పంటలు, మల్బరీ తోటలకు సోకిన చీడపీడలు, వాటి లక్షణాలు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. పంటలకు సోకే వైరస్‌లు, వాటిని నివారించేందుకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరిస్తారు. సూక్ష్మపోషకాల లోపాలు, వాటి లక్షణాలు, నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తారు. వ్యవసాయ, ఉద్యానవన పంటల్లో ఎటువంటి సమస్య ఉత్పన్నమైనప్పటికీ మండలంలోని పీహెచ్‌డీసీలో నిర్ధారించి పరిష్కారానికి సూచిస్తారు.

రైతులకు మేలు



ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్లతో రైతులకు మేలు జరుగుతుంది. పంటలకు సోకిన వైరస్‌లను తెలుసుకోవడం, నివారణకు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పంటలకు మంచి దిగుబడి రావడమే కాకుండా వ్యయం తగ్గుతుంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇప్పటికే మండలానికి ఒకటి చొప్పున పీహెచ్‌డీసీలను ఎంపిక చేశాం. రైతులు పంటలకు సోకే ఎటువంటి సమస్యలనైనా పీహెచ్‌డీసీల ద్వారా పరిష్కరించుకోవచ్చు.

– ఎస్.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

‘గడపగడపకు’ ఒక యజ్ఞం లాంటిది


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- ఏ ముఖ్యమంత్రి తీసుకోని నిర్ణయం వైఎస్ జగన్ తీసుకున్నారు
- ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ఇంటి వద్దకే వైద్యం అందిస్తున్నారు
- సంక్షేమం, అభివృద్ధి చేశాం కాబట్టే ప్రతి గడపకు వెళ్తున్నాం
- ఒంగోలు 32వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఒక యజ్ఞంలాంటిదని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే, బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒంగోలు నగరంలోని 32వ డివిజన్‌లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ తాడి కృష్ణలతతో కలిసి గద్దలగుంటలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్న తీరును బాలినేని స్వయంగా ప్రజలనడిగి తెలుసుకున్నారు. గడపగడపకు వెళ్తుంటే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలుతీరు అర్థమవుతోందన్నారు. ఇంకేమైనా సమస్యలుంటే ప్రజలు స్వయంగా తన దృష్టికి తీసుకొస్తున్నారన్నారు. అలాంటి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. ఏ ముఖ్యమంత్రి తీసుకోని విప్లవాత్మకమైన, ప్రయోగాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా సీఎం వైఎస్ జగన్ నిలిచిపోతున్నారని చెప్పారు. ఇప్పటి వరకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు కొత్తగా గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వినూత్నంగా సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకం ద్వారా మారుమూల పల్లెల్లో సైతం వైద్యులు ఇళ్లకు వెళ్లి ప్రజలకు చికిత్స చేయనున్నారని బాలినేని తెలిపారు. ప్రజల కష్టాలు తెలిసిన నేత.. సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. ఒంగోలు నగరంతో పాటు నియోజకవర్గంలోని అన్ని సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజల ఇబ్బందులేమైనా ఉంటే తన ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తోందని తెలిపారు. అందుకే ధైర్యంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై ఆరా తీస్తున్నామన్నారు. గద్దల గుంటలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేశామని, ఇంకా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని బాలినేని వెల్లడించారు.

కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాదు, ఏపీ టైలర్స్ కార్పొరేషన్ చైర్మన్ సుభాన్ బీ షేక్, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావుమాదిగ, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, పార్టీ నాయకుడు కఠారి శంకర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, ట్రేడ్ యూనియన్ నాయకుడు పుచ్చకాయల గోవర్ధన్ రెడ్డి, చావల శ్రీనివాసరావు, చింతగుంట్ల సువర్ణ, బొమ్మినేని మురళి, తూము పద్మ, మీరావలి, 32వ డివిజన్ అధ్యక్షుడు కోసూరి శేఖర్, తోటపల్లి సోమశేఖర్, కొల్లా అశోక్, బడుగు ఇందిర, చిట్టెం సురేష్, మన్నేపల్లి అంకబాబు, జువ్విశెట్టి వెంకట్రావు, నత్తల భీమేష్, గాజుల సాయి, ఓగిరాల వెంకట్రావు, తోటపల్లి వెంకటేష్, గరికపాటి గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి టీడీపీ ఆటంకాలు


టీడీపీ కార్పొరేటర్ రమణయ్య వ్యాఖ్యలను ఖండిస్తున్న డిప్యూటీ మేయర్ మాధవరావు, సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత

- వార్డు సచివాలయం, చిల్డ్రన్ పార్కు కట్టాలంటే వద్దంటారు
- పీవీఆర్‌లో ఇంటర్మీడియెట్ కళాశాలకు భవనం కట్టాలంటే కుదరదంటారు
- బందీల దొడ్డి నిర్మించాలంటే అడ్డుకుంటున్నారు
- నగరపాలక సంస్థకు ఆదాయ మార్గాలు పెంచుదామంటే అడ్డుతగులుతారు
- టీడీపీ కార్పొరేటర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లులా చూస్తున్నారన్న అధికార పార్టీ సభ్యులు
- మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహణ

ఒంగోలు సబర్బన్: టీడీపీ నీచ రాజకీయాలకు పాల్పడుతూ నగరంలో అభివృద్ధిని అడ్డుకుంటోందని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు మండిపడ్డారు. పేదలకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశం అజెండాలోని ప్రతి అంశంపైనా అడ్డుతగులుతూ ఒంగోలు నగరపాలక సంస్థ అభివృద్ధికి మోకాలడ్డుతున్నారని టీడీపీ సభ్యులపై ధ్వజమెత్తారు. గురువారం ఒంగోలు నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహించారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా సాధారణ సమావేశంలో 23 అంశాలు ఆమోదానికి పెట్టగా, అత్యవసర సమావేశంలో నాలుగు అంశాలను సభ్యుల ఆమోదానికి పెట్టారు. రెండు సమావేశాల్లోనూ రెండుమూడు మినహా అన్ని అంశాలను అధికార వైఎస్సార్ సీపీకి చెందిన సభ్యుల ఏకాభిప్రాయంతో ఆమోదించారు. పట్టుమని ఆరుగురు కూడా లేని టీడీపీ సభ్యులు ప్రతి అంశంలోనూ అడ్డుతగులుతుండటంతో వైఎస్సార్ సీపీ సభ్యులు తీవ్ర స్థాయిలో ప్రతిఘటించారు. అత్యధికంగా ఉన్న వైఎస్సార్ సీపీ సభ్యులు ఒకటిరెండు మినహా అన్ని అంశాలను ఆమోదింపజేశారు.

అడుగడుగునా అడ్డు తగిలిన టీడీపీ సభ్యులు...

ఒంగోలు నగరంలో ఆవులు, పందుల బెడద అధికంగా ఉందని, దక్షిణ బైపాస్‌లోని పోస్టల్ కాలనీ సమీపంలో మున్సిపల్ స్థలం ఉంటే అందులో బందీలదొడ్డి నిర్మాణానికి కౌన్సిల్‌లో ఆమోదానికి పెడితే దానికి టీడీపీ సభ్యులు అడ్డుతగిలారు. అదేవిధంగా 48వ డివిజన్‌లోని దిబ్బలరోడ్డులో రైతు బజారు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో వార్డు సచివాలయం, చిల్డ్రన్స్ పార్కు నిర్మాణాన్ని ఆమోదానికి పెడితే అక్కడ నిర్మాణం చేపట్టడానికి లేదని అడ్డుకున్నారు. పీవీఆర్ స్కూలులో ప్రస్తుతం ప్రభుత్వ ఇంటర్మీడియెట్ కళాశాల నడుస్తోంది. అందుకుగానూ పీవీఆర్ ప్రాంగణంలో నూతన భవనాన్ని నిర్మించేందుకు ఆమోదానికి పెడితే దానినీ అడ్డుకోవాలని చూశారు. ఒంగోలు నగరంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టాలని అధికార వైఎస్సార్ సీపీ సభ్యులు చూస్తుంటే.. టీడీపీ సభ్యులు అడ్డుతగలటాన్ని ప్రతిఘటించారు. ఒక స్థాయిలో ఇరుపార్టీల సభ్యుల మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. నగరంలో అభివృద్ధిని అడ్డుకుంటున్నారంటూ టీడీపీ సభ్యులపై డిప్యూటీ మేయర్లు, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ధ్వజమెత్తారు. ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలా చూసుకుంటూపోతున్నారని అధికార పార్టీ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దానిని కూడా ప్రతిపక్ష టీడీపీ సభ్యులు ఓర్వలేక లేనిపోని విధంగా అడ్డుతగులుతున్నారని ధ్వజమెత్తారు. అనంతరం టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల కోసం 11 వేల మంది లబ్ధిదారుల నుంచి వసూలు చేసిన డబ్బును తిరిగి వాళ్లకు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని అధికార వైఎస్సార్ సీపీ సభ్యులు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. మొత్తం రూ.11 కోట్లు చెల్లించాల్సి ఉందని, ప్రస్తుతం రూ.3 కోట్లు చెల్లించే వీలుందని, మిగతా రూ.9 కోట్లు ప్రభుత్వం నుంచి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. నగరంలో ఎల్ఈడీ లైట్లు నిర్వహిస్తున్న ఈఈఎస్ఎల్ సంస్థ నుంచి నిర్వహణ బాధ్యతను ఒంగోలు నగరపాలక సంస్థ తీసుకోవాలని డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఆ విధంగా చేయగలిగితే నగరపాలక సంస్థకు నెలకు దాదాపు రూ.20 లక్షల వరకు ఆదాయం సమకూరుతుందని చెప్పడంతో ఆ నిర్ణయానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో సభ్యులు అడిగిన సందేహాలను నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంఈ కే మాల్యాద్రి, ఏసీపీ కేవీ వెంకటేశ్వర్లు, శానిటేషన్ సూపర్‌వైజర్ పిచ్చయ్య నివృత్తి చేశారు. సమావేశంలో అన్ని డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పరిశీలనలో క్రిటికల్ కేర్ కాంప్లెక్స్ ప్రతిపాదన

ఒంగోలు అర్బన్: స్థానిక జీజీహెచ్‌లో క్రిటికల్ కేర్ కాంప్లెక్స్ ప్రతిపాదన పరిశీలనలో ఉందని అకడమిక్ డైరెక్టర్ డీఎంఈ డాక్టర్ కె.సత్యవరప్రసాద్ అన్నారు. గురువారం జీజీహెచ్‌లో క్రిటికల్ కేర్ కాంప్లెక్స్ కోసం స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జీజీహెచ్ వైద్యులతో సమావేశమై పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు దృష్టిలో ఉంచుకుని వైద్యసేవలు అందించాలన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్‌నాయక్, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ సాల్మన్ రాజు, వైస్ ప్రిన్సిపాళ్లు వెంకటరమణ, సుధాకర్, ఆర్ఎంవో చైతన్యవర్మ తదితరులు పాల్గొన్నారు.

పేదల గుండె తడి తెలిసిన వ్యక్తి.. జగనన్న

- విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత
- పేదల ఆరోగ్యంపై శ్రద్ధ చూపని గత ప్రభుత్వం
- దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం
- ఉచితంగా ఆధునిక వైద్యం అందించడమే లక్ష్యం
- రాష్ట్ర పురపాలక శాఖామంత్రి ఆదిమూలపు సురేష్


గంగుపల్లి గ్రామంలో 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల గుండె తడి తెలిసిన వ్యక్తి కావడం వలన వారి ఆరోగ్యంపై ఎనలేని శ్రద్ధ చూపుతున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటింటికీ మంచి వైద్యం అందే కార్యక్రమాన్ని చేపడుతున్నారని తెలిపారు. యర్రగొండపాలెం మండలంలోని గంగుపల్లి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ చికిత్స కంటే నివారణ చాలా గొప్పదన్న ఉద్దేశంతో రాష్ట్రంలోని ప్రజలందరికీ ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలన్న ప్రధాన లక్ష్యంతో దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారని తెలిపారు. కూలి పనులు చేసుకుని జీవనం సాగించే పేదలు జబ్బున పడి.. అది ముదిరి చావుబతుకులతో కార్పొరేట్ వైద్యశాలల్లో చేరుతున్నారని, లక్షల రూపాయలు ఖర్చుపెట్టినప్పటికీ నయం కాక ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో ప్రభుత్వ వైద్యశాలలను నిర్లక్ష్యం చేశారని మంత్రి విమర్శించారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదింటి పెద్దకుమారుడై అన్నీతానై చూసుకుంటూ పేదల ఆరోగ్యంపై శ్రద్ధ వహించే విధంగా చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వైద్యం కంటే పరీక్షలు చాలా ఖరీదైనవని, అటువంటి పరిస్థితులకు పేదలు భయపడకుండా ఉండేందుకు డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో 14 రకాల పరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నారని మంత్రి వివరించారు. ప్రతి మండలానికి కనీసం రెండు పీహెచ్‌సీలు, ఇద్దరేసి డాక్టర్లు, ఒక 104 వాహనాన్ని అనుసంధానం చేస్తారన్నారు. పీహెచ్‌సీలో ఒక డాక్టర్ ఉంటే.. మరొక డాక్టర్ తనకు కేటాయించిన గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి వైద్యం అందిస్తారని తెలిపారు. పేదల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తున్న ఇటువంటి ముఖ్యమంత్రిని గతంలో ఎన్నడూ చూడలేదని, అటువంటి వ్యక్తిని మర్చిపోకుండా మరో పర్యాయం సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రి సురేష్ అన్నారు. అనంతరం 104 వాహనాన్ని మంత్రి ప్రారంభించారు.

కార్యక్రమంలో తహసీల్దార్ కె.రవీంద్రారెడ్డి, ఎంపీడీవో ఎం.రంగసుబ్బరాయుడు, మార్కాపురం, శ్రీశైలం డీఎంహెచ్‌వోలు డాక్టర్ రాహుల్, డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, వైద్యాధికారులు చంద్రశేఖరరావు, నాయబ్‌రసూల్, సునీల్, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.ఓబుల్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, గుర్రపుశాల సర్పంచ్ వాడాల పద్మవీరయ్య పాల్గొన్నారు.


13న కంచి పీఠాధిపతి రాక

● బ్రోచర్లు ఆవిష్కరించిన గూడా రాంమోహన్, మఠంపల్లి దక్షిణామూర్తి

ఒంగోలు: కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఈ నెల 13వ తేదీ ఒంగోలు రానున్నట్లు స్వాతి గ్రానైట్స్ అధినేత గూడా రాంమోహన్, వేదపండితుడు మఠంపల్లి దక్షిణామూర్తి తెలిపారు. స్థానిక మంగమూరు రోడ్డులోని స్వాతి గ్రానైట్స్ అధినేత రాంమోహన్ నివాసంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నాలుగు రోజులపాటు స్థానిక మంగమూరు డొంకలోని స్వాతి గ్రానైట్స్ యజమాని నివాసంలో భక్తులకు అందుబాటులో ఉంటారన్నారు. శ్రీమహా త్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వరస్వామికి ప్రతి నిత్యం అభిషేకం, త్రికాలార్చన, విశేష అర్చనలు నిర్వహిస్తారన్నారు. అనంతరం భక్తులకు తీర్థగోష్టి ఉంటుందన్నారు. స్వామివారి ఆశీసులు అందరూ తీసుకోవాలని కోరారు. ఈ నెల 16న పొదిలిలో రూ.20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సంప్రదాయ విద్య పాఠశాల (సీబీఎస్ఈ విద్యతో పాటు వివిధ కళల్లో ఉచిత శిక్షణ)ను ఆయన పరిశీలిస్తారని వెల్లడించారు.

బాలినేని దంపతులు నిర్వహించే పూర్ణాహుతికి 14న హాజరు...

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ లోక కల్యాణార్థం ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు ఈ నెల 11వ తేదీ నుంచి రాజశ్యామల యాగం ప్రారంభిస్తున్నారని గూడా రాంమోహన్, మఠంపల్లి దక్షిణామూర్తి తెలిపారు. ప్రజలు సుఖంగా ఉండాలని గతంలో రాజులు ఈ యాగం నిర్వహించేవారని, ప్రస్తుతం ఈ యాగాన్ని స్థానిక సంతపేటలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో బాలినేని దంపతులు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. 14వ తేదీ ఈ యాగానికి సంబంధించి పూర్ణాహుతిని కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి చేస్తారని తెలిపారు. బ్రోచర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో గూడ కౌశిక్, తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న గూడా రాంమోహన్, మఠంపల్లి దక్షిణామూర్తి

క్లుప్తంగా

జిల్లా జడ్జిగా ఎంపికైన కొమరోలు వాసి


అబ్రహం

కొమరోలు: మండలంలోని రెడ్డిచెర్ల గ్రామానికి చెందిన బందెల అబ్రహం జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. గిద్దలూరు కోర్టులో లాయరుగా విధులు నిర్వహిస్తున్న సమయంలో జిల్లా జడ్జి నియామక పరీక్షలు రాశారు. ప్రస్తుతం ఆయన పల్నాడు జిల్లా వినుకొండలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా జడ్జిగా ఎంపికైన అబ్రహంను పలువురు అభినందించారు.

ఈతకు వెళ్లి గల్లంతైన యువకుడు మృతి


మృతదేహాన్ని బయటకు తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పొదిలి: పట్టణంలోని దాసరిగడ్డకు చెందిన ఆరుగురు విద్యార్థులు బుధవారం ఈత కొట్టేందుకు స్థానిక జగనన్న లేఅవుట్ సమీపంలోని గుంతలోకి దిగగా వారిలో చెరుకూరి నాగార్జున(19) అనే యువకుడు గల్లంతైన విషయం తెలిసిందే. ఎస్సై మల్లికార్జున ఆధ్వర్యంలో నాగార్జున ఆచూకీ కోసం ఈతగాళ్లు గాలించారు. చీకటిగా ఉండటంతో సహాయక చర్యలు నిలిపివేశారు. తిరిగి గురువారం ఉదయాన్నే అగ్నిమాపక కేంద్రం సిబ్బంది గాలింపు చర్యలకు ఉపక్రమించారు. నీటి గుంతలో అడుగున చిక్కుకున్న నాగార్జున మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని చూసిన బంధువులు బోరున విలపించారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు.

పాహిమాం.. రంగనాయకా..



ప్రత్యేక అలంకరణలో రంగనాయకస్వామి, ఆదిలక్ష్మి అమ్మవారు

రాచర్ల: నల్లమల అభయారణ్యంలో కొలువై ఉన్న నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటలకు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. రాత్రి 8.30 గంటలకు ధ్వజారోహణం అనంతరం స్వామి వారు శేషవాహనంపై రంగనాయకస్వామి అలంకారంలో, హనుమంత వాహనంపై శ్రీరాముడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నెమలిగుండ్ల రంగనాయకస్వామి, ఆదిలక్ష్మి అమ్మవారిని ఆలయ అర్చకుడు అన్నవరం సత్యనారయణచార్యులు ప్రత్యేకంగా అలంకరించారు. రాచర్ల మండలం జేపీ చెరువుకు 8 కి.మీ దూరంలో వెలసిన రంగనాయకస్వామి ఆలయానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయా చైర్మన్ కన్నసాని చిన్న ఓబులేసు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణంలోని వివిధ సామాజికవర్గాల సత్రాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

కళ్యాణం, తెప్పోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

దేవస్థానం ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు రంగనాయకస్వామి, ఆదిలక్ష్మి అమ్మవారి కళ్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ తెలిపారు. కల్యాణానికి ఉభయదాతలుగా ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు కుటుంబ సభ్యులు వ్యవహరిస్తారని, స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని చెప్పారు. శనివారం ఉదయం 9 గంటలకు తెప్పోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. తెప్పోత్సవం సమయంలో గిద్దలూరు, రాచర్ల ఎస్సైలు బ్రహ్మనాయుడు, వి.మహేష్, ప్రత్యేక పోలీస్ బలగాలతో బందోబస్తు నిర్వహించనున్నట్లు గిద్దలూరు సీఐ ఎస్ఎమ్‌డీ ఫిరోజ్ తెలిపారు.

నమో.. చెన్నకేశవా..

- ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- నేడు శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి కళ్యాణం


సూర్య వాహనంపై స్వామివారి ఊరేగింపు

మార్కాపురం టౌన్: భూదేవి, శ్రీదేవి సమేత శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు బుధవారం రాత్రి అంకురార్పణ చేయగా.. గురువారం ఉదయం ధ్వజారోహణంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు సూర్య వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత(తెల్లవారితే శుక్రవారం) స్వామివారి కళ్యాణానికి పాలకమండలి సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారి ఆలయాన్ని, గోపురాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. కళ్యాణం అనంతరం స్వామి వారు చంద్ర వాహనంపై శ్రీమన్నారాయణమూర్తి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని చైర్మన్ పెనుగొండ కేశవరావు, ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కళ్యాణోత్సవానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా పాలక మండలి, దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యుల సహకారంతో అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.


ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు, కమిటీ సభ్యులు

నేడు చదలవాడ రఘునాయకస్వామి కళ్యాణం

నాగులుప్పలపాడు: చదలవాడలో రఘునాయకస్వామి కళ్యాణం శుక్రవారం ఉదయం 8.48 గంటలకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఈఓ అనిల్‌కుమార్ తెలిపారు. శ్రీరామనవమి పండగతో ప్రారంభమైన రఘునాయకస్వామి 238వ వార్షిక తిరునాళ్లలో భాగంగా శుక్రవారం కళ్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్వామి వారి కళ్యాణ ఘట్టం గరుడ పక్షి రాకతో ప్రారంభం కానుంది. ఈ అద్భుత దృశ్యాన్ని తిలకించేందుకు, స్వామి వారి కళ్యాణాన్ని కనులారా వీక్షించేందుకు వేలాదిగా హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకార్యం లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈఓ తెలిపారు.


రఘునాయకస్వామి మూలవిరాట్

మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు

- పది పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ


పది పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ

ఒంగోలు టౌన్: పదో తరగతి పరీక్షలు జరుగుతున్న నగరంలోని భాష్యం హైస్కూలు, సెయింట్‌థెరిసా స్కూలులోని పరీక్షా కేంద్రాలను ఎస్పీ మలికా గర్గ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసుల అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరిండెంట్లతో మాట్లాడిన ఆమె పరీక్షలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని పరీక్షల నిర్వహణ సిబ్బందికి చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 16 ఫ్లయింగ్ స్క్వాడ్లు, ప్రతి సర్కిల్ పరిధిలో ఒక మొబైల్ పెట్రోలింగ్ బృందం నిరంతర పర్యవేక్షణలో ఉన్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు ఉన్నట్లు తెలిస్తే వెంటనే అదుపులోనికి తీసుకుంటామన్నారు. విద్యా శాఖ నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా ప్రవర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు శాఖ తరుపున అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎస్పీ వెంట ట్రైనీ ఐపీఎస్ అంకిత సురాన, ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు, టూటౌన్ సీఐ ఎస్.జగదీష్ తదితరులు ఉన్నారు.

పాత రూపాయికే బిర్యానీ!


బిర్యానీ కోసం క్యూలో ఉన్న ప్రజలు

మార్కాపురం: ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలోని కోర్టు సెంటర్‌లో మొగల్స్ రెస్టారెంట్ ఓపెనింగ్ సందర్భంగా యజమాని వలి పెట్టిన వినూత్న ఆఫర్ సంచలనం కలిగించింది. ఈ రెస్టారెంట్‌ను గురువారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ అలీబేగ్ ప్రారంభించారు. ప్రారంభం సందర్భంగా నాన్ వెజ్ ప్రియుల కోసం పాత రూపాయి నోటు తీసుకొచ్చిన వారికి రూపాయికే చికెన్ బిర్యానీ ఆఫర్ ప్రకటించడంతో ఇళ్లలో, షాపుల్లో, తెలిసిన వారి దగ్గర ఎక్కడో మూలనపడిన రూపాయి నోటు తీసుకుని రెస్టారెంట్‌కు భారీగా జనం వచ్చారు. మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు ఈ ఆఫర్ వర్తిస్తుందని చెప్పడంతో 11.30 గంటల నుంచే క్యూ కట్టారు. సుమారు 100 మీటర్లకుపైగా క్యూకట్టడంతో కోర్టు సెంటర్, ఒంగోలు రోడ్డులో అరగంటపాటు ట్రాఫిక్ జామైంది. సుమారు 500 మందికిపైగా పాత రూపాయి నోటు ఇచ్చి బిర్యానీ తీసుకెళ్లారు.

క్రీడలతో సంపూర్ణ వికాసం

- ఏకేయూ రిజిస్ట్రార్ హరిబాబు


వాలీబాల్‌లో విజేతగా నిలిచిన డీఆర్‌ఆర్‌ఎం హైస్కూల్ జట్టు


హ్యాండ్‌బాల్‌లో విజేతగా నిలిచిన గౌతమి మోడల్ స్కూల్ జట్టు

ఒంగోలు: క్రీడలతోనే సంపూర్ణ వికాసం సిద్ధిస్తుందని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ బి.హరిబాబు అన్నారు. స్థానిక ఏకేయూ ఆవరణలో గురువారం జరిగిన మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థుల 4వ ఇంటర్ స్కూల్ పెడగాగి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంపీడీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు 21 రోజులపాటు ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడలపై శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం పలు పాఠశాలల జట్లకు క్రీడాపోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, మెమెంటోలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సీనియర్ వినాయక్ ప్రసాద్, డాక్టర్ కేవీఎస్ రాజు, డాక్టర్ జి.సోమశేఖర్, డాక్టర్ బి.కృష్ణ, డాక్టర్ పి.హైమావతి, డాక్టర్ సీహెచ్‌హిమశిల్ప, డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి , వ్యాయామ విద్య కో ఆర్డినేటర్ డాక్టర్ ఐ.దేవీ వరప్రసాద్ అందజేశారు.

వరికూటి కోటమ్మకు ఘన నివాళి


వరికూటి కోటమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

టంగుటూరు: వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు వరికూటి అమృతపాణి తల్లి కోటమ్మ పెద్దకర్మ టంగుటూరు మండలంలోని కారుమంచి గ్రామంలో గురువారం నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ నరిమూడి విక్టర్ ప్రసాద్, చీరాల ఇన్‌చార్జి కరణం వెంకటేష్, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొని కోటమ్మ చిత్రపటానినికి నివాళులర్పించారు. వరికూటి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, పార్టీ మండల అధ్యక్షులు సూదనగుంట శ్రీహరిరావు, సొసైటీ అధ్యక్షులు రావూరి ప్రవీణ్, సింగరాయకొండ వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, వల్లూరమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసరావు, కుందం హనుమారెడ్డి, కొండపి మండల అధ్యక్షుడు గోగినేని వెంకటేశ్వర్లు, ఆరు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు పాల్గొన్నారు.

‘ఫ్యామిలీ డాక్టర్’తో ఆరోగ్య విప్లవం

- కలెక్టర్ దినేష్‌కుమార్
- కొత్తపట్నం మండలం గుండమాల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభం


గుండమాలలో ఫ్యామిలీ డాక్టర్ ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

గుండమాల (కొత్తపట్నం): రాష్ట్రంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దే ప్రజలకు వైద్యసేవలు అందిస్తూ ఆరోగ్య విప్లవం తీసుకొచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కలెక్టర్ దినేష్‌కుమార్ కొనియాడారు. గురువారం జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని కొత్తపట్నం మండలంలోని గుండమాల గ్రామంలో కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అందుకోసం విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందన్నారు. ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తూ.. వారి అనారోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే స్వగ్రామంలో ఇంటి వద్దే గుర్తించేందుకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అవసరమైన చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మార్చడంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో సురేష్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చూస్తోందని, అన్ని పోస్టులను భర్తీ చేస్తోందని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వలన గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎన్నో ఉపయోగాలున్నాయని వివరించారు. అనంతరం కలెక్టర్ దినేష్‌కుమార్ రిబ్బన్ కట్ చేసి 104 వాహనాన్ని, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో మాధవీలత, తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, పంచాయతీరాజ్‌శాఖ ఏఈ కాకుమాను శివరామకృష్ణ, రాష్ట్ర మత్స్యకార వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాయల సుమతి, సర్పంచ్‌లు కారాని జయరావు, కోడూరి గోపి, ఎంపీటీసీ సభ్యుడు పురిణి వెంకట్రావు, యూడీసీ కూచిపూడి శరత్, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ హేమంత్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు షేక్ బాబామాలిక్, షేక్ అమానుల్లా, శ్రీనాథ్, ఏఎన్‌ఎం వెంకటేశ్వర్లమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు పక్కాగా నిరోధించాలి

- మత్తు పదార్థాలతో ఏర్పడే సమస్యలపై అవగాహన కల్పించాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో మాదకద్రవ్యాల సాగు, రవాణా, వినియోగాన్ని పక్కాగా నిరోధించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. క్యాంపు కార్యాలయంలో గురువారం జిల్లా స్థాయి మాదకద్రవ్య నివారణ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను మాదకద్రవ్య రహితంగా మార్చడంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను కట్టడి చేసేందుకు శాఖల పరంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, ఇతర నష్టాలు, కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం కావడం వంటి అంశాలపై విద్యా సంస్థల్లో విద్యార్థులతో పాటు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో మెడికల్ షాపులు, ఇతర దుకాణాల్లో ఎటువంటి మాదక ద్రవ్యాలు, నిషిద్ధమైన మందులు విక్రయించకుండా డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గంజాయి అక్రమ సాగును నివారించి సంబంధిత రైతులకు ప్రభుత్వ పథకాల ద్వారా జీవనోపాధి కల్పించాలన్నారు. ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ గంజాయి, నాటుసారాపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో గంజాయి సాగు ద్వారా అక్రమ పద్ధతిలో డబ్బు సంపాదించాలనుకునే వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. మాదకద్రవ్యాలు సాగు చేసినా, వినియోగించినా చట్టపరంగా తీసుకునే చర్యలపై సంకల్పం అనే కార్యక్రమం ద్వారా కాలేజీల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, ట్రైనీ ఐపీఎస్ అంకితా సురానా, డ్రగ్స్ విభాగం ఏడీ జ్యోతి, ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరరావు, కనిగిరి ఆర్డీఓ అజయ్‌కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ సురేష్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ సుబ్బారావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కన్నాలు వేయడంలో ఆరితేరిన దొంగల అరెస్టు

- రూ.12 లక్షల విలువైన బంగారం స్వాధీనం
- పోలీసు అధికారులను అభినందించిన ఎస్పీ మలికా గర్గ్


చోరీ కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: ఇంటికి సున్నం వేసినంత సులువుగా కన్నం వేయడం అతడికి అలవాటు. కళ్లు మూసి తెరిచే లోపే ఇంటికి వేసిన తాళాల్ని మాయం చేయడంలో దిట్ట. ఎట్టకేలకు జిల్లా పోలీసుల వలలో చిక్కాడు. విజయవాడలోని చిట్టినగర్‌కు చెందిన కొరపాటి వీరనాగరాజు, అజయ్‌సింగ్‌నగర్‌కు చెందిన కందివలస నరసింహారావును అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి రూ.12 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.90 వేల విలువైన సుజుకి స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మలికా గర్గ్ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిపాడులో గత నెలలో గంటా రాంబాబు నివాసంలో దొంగలు పడి 28 సవర్ల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. వెదురు కర్రకు బూటు లేసు కట్టి దోటికర్ర లాగా ఉపయోగించి గది లోపల వేసిన గడియను తొలగించారు. ఇంట్లో కప్‌బోర్డులో ఉంచిన 28 సవర్ల బంగారు నగలను దొంగలించి పారిపోయారు. రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఎస్పీ ఆదేశాలతో వెంటనే రంగంలోకి దిగారు. ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు ఆధ్వర్యంలో రూరల్ సీఐ వి.శ్రీనివాసరెడ్డి, మద్దిపాడు ఎస్సై టి.శ్రీరాం ముమ్మరంగా దర్యాప్తు చేసి సమాచారాన్ని రాబట్టారు. బుధవారం సాయంత్రం మద్దిపాడు మండలం రాచవారిపాలెం వద్ద కొరపాటి వీరనాగరాజు, కందిపలస నరసింహారావును అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు నేరం చేసినట్లుగా అంగీకరించారు. నాగరాజు 63 చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఇతడు మరో ఐదు పేర్లతో చలామణి అవుతున్నట్లు గుర్తించారు. మరో నిందితుడు నరసింహారావు మీద బైకు చోరీ కేసులు 5 ఉన్నాయి.

పోలీసులకు రివార్డులు

మద్దిపాడులో చోరీ కేసును ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన అడిషనల్ ఎస్పీ (క్రైమ్)ఎస్వీ శ్రీధర్‌రావు, ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు, రూరల్ సీఐ వి.శ్రీనివాసరెడ్డి, మద్దిపాడు ఎస్సై శ్రీరాం, కానిస్టేబుల్ జి.సురేష్, ఓ.రాఘవ, ఎస్.రామయోగి, సీసీఎస్ ఏఎస్ఐ టి.బాలాంజనేయులు, కానిస్టేబుల సీహెచ్ అంజిబాబుకు ఎస్పీ మలికా గర్గ్ రివార్డులు ప్రకటించి, ప్రశంసా పత్రాలు అందజేశారు.

పచ్చ మీడియాకు పైత్యం ఎక్కువైంది

- అసత్యాలు వండి వారుస్తున్నారు
- అభివృద్ధిని రెండు కళ్లతో చూడలేకున్నారు
- కార్పొరేటర్లపై అభాండాలు వేస్తే సహించం
- పచ్చ మీడియాపై ధ్వజమెత్తిన మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు

ఒంగోలు సబర్బన్: పచ్చ మీడియాకు పైత్యం ఎక్కువైంది. నగరంలో అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్యాలు వండి వారుస్తున్నారని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత ధ్వజమెత్తారు. ఈ మేరకు మేయర్ గంగాడ సుజాతతో పాటు ఒంగోలు మున్సిపల్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, కార్పొరేటర్లు కలిసి గురువారం స్థానిక నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పచ్చమీడియా రాతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి కౌన్సిల్ సమావేశం ముందు రోజు అసత్య కథనాలు ప్రచురించడం ఆ పత్రికలకు పరిపాటిగా మారిందని విమర్శించారు. అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలేగానీ, కనీసం ఇంగితం కూడా లేకుండా అబద్ధాలు ప్రచురించడం దారుణమని మండిపడ్డారు. కార్పొరేషన్ ధారాదత్తం అని...నగరపాలక సంస్థ ఖాళీ స్థలాలపై కార్పొరేటర్ల కన్ను అని ఇష్టం వచ్చినట్లు అసత్య కథనాలు ప్రచురిండం సరికాదన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఒంగోలు నగరంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష టీడీపీ నాయకులకు, పచ్చ మీడియాకు కన్ను కుడుతోందని మండిపడ్డారు. ఇప్పటి వరకు నగరంలో రూ. 50 కోట్లకు పైగా అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మరో రూ.30 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. పత్రికలు ప్రజల్లో చైతన్యాన్ని నింపాలి కానీ అసత్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం సరికాదన్నారు. నగరంలో అభివృద్ధితోపాటు ఆదాయ వనరులను పెంచుకోవటం చేయకుండా ఇక పాలకమండలి ఏం చేయాలో చెప్పాలని ప్రశ్నించారు. గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన కోట్లాది రూపాయల అప్పులు ఒక పక్క తీర్చుకుంటూ, మరోపక్క అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే బురద జల్లడం ఏంటని ధ్వజమెత్తారు. ప్రజల అవసరార్థం కౌన్సిల్‌లో తీర్మానాలు చేస్తుంటే కబ్జాలు అని అసత్యాలు చెబుతారా అని ప్రశ్నించారు. కార్పొరేటర్లపై అభాండాలు వేస్తే సహించేది లేదని హెచ్చరించారు. హోర్డింగులు పెట్టటం కూడా నేరమా...ఆదాయ వనరులు లేకుండా ప్రజలకు సేవలు ఏ విధంగా చేస్తారో తెలియదా అని ప్రశ్నించారు. వార్డు సచివాలయం, చిల్డ్రన్స్ పార్కు ఆమోదానికి పెడితే అది కబ్జా అని కథనాలు రాయటం ఏంటని నిలదీశారు. విలేకరుల సమావేశంలో ఇమ్రాన్‌ఖాన్, తాడి కృష్ణలత, అంబటి ప్రసాదరావు, ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య, చింతపల్లి గోపీచంద్, తేళ్ల చంద్రశేఖర్, వేమూరి భవానీ మాల్యాద్రి, నీలంరాజు సరోజ, ఎండేటి పద్మావతి, గండు ధనలక్ష్మి, ఎస్‌కే.నూర్‌జాన్, వెన్నపూస శోభారాణి, ఇంతియాజ్, ఫాతిమాబీ, గోలి లక్ష్మీ కోటేశ్వరమ్మ, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.